
# ప్రజాశక్తి


శుక్రవారం 5 జులై 2024

5

పార్వతీపురం మన్యం

## ప్రభుత్వ పథకాలు గిరిజనులకు చేరువ



**ప్రజాశక్తి - సీతంపేట**

ప్రభుత్వ పథకాలు గిరిజనులకు సత్వరం చేరువ చేసేలా కృషి చేస్తానని ఎపిఒ జి.చినబాబు అన్నారు. గురువారం ఆయన ఎపిఒ (జనరల్)గా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుమూల గిరిజన ప్రాంతాల్లో ఉండే గిరిజనులకు ప్రభుత్వ పథకాలు సత్వరం అందేలా చర్యలు తీసుకొంటానన్నారు. విశాఖలో గిరిజన సాంస్కృతిక పరిశోధన, శిక్షణా సంస్థల బఫెతీగా పనిచేస్తూ బదిలీపై ఇక్కడ ఎపిఒగా చినబాబు వచ్చారు.

# మలేరియాకు మందుల్లేవ్...

### అన్నీ ఉన్నాయంటున్న అధికారులు

### రోగులను రిఫర్ చేస్తున్న వైద్యులు

### ఏరియా ఆస్పత్రికి పెరుగుతున్న తాకిడి



సాలూరు ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినిలు, చిన్నారులు

**ప్రజాశక్తి - సాలూరు**

ఏజెన్సీ ప్రాంతంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మలేరియా జ్వరానికి అవసరమైన మందుల్లేని పరిస్థితి కనిపిస్తోంది. వర్షాకాలం ప్రారంభమైంది. తరచూ వర్షాలు పడుతున్నాయి. దీంతో గిరిజన ప్రాంతాల్లో వైరల్, మలేరియా జ్వర పీడితుల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. ప్రధానంగా గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులు జ్వరాల బారిన పడుతున్నారు. ఇటీవల మండలంలోని కురుకుట్టి గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత బాలికల పాఠశాలకు చెందిన తొమ్మిది విద్యార్థినులు మలేరియా జ్వరాలతో స్థానిక ఏరియా ఆసుపత్రిలో చేరారు. మిగిలిన గిరిజన ఆశ్రమ పాఠశాలల్లోనూ జ్వరపీడితులు ఉన్నారు. ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు అనారోగ్యానికి గురైతే వారి అనారోగ్య లక్షణాలను బట్టి స్థానిక ఎఎన్ఎంలే చికిత్స చేయాలి. అలా చేయడానికి చాలా ఆశ్రమ పాఠశాలల్లో ఎఎన్ఎంల్లేరు. కొన్ని పాఠశాలల్లో స్థానిక పాఠశాల యాజమాన్యాలు వారి అవసరాలను బట్టి సొంతంగా జీతాలిచ్చుకుని ఎఎన్ఎంలను నియమించుకున్నారు. ఎఎన్ఎంలు ఇచ్చిన మందులతో ఆరోగ్యం కుదుట పడకపోతే సమీపంలో ఉన్న పిహెచ్‌సికి తీసుకెళ్లాలి. అక్కడ విద్యార్థులను ప్రాథమికంగా వైద్యులు పరీక్షించి వ్యాధిని బట్టి వైద్యం అందించాలి. ఆవిధంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు తీసుకెళ్తున్న విద్యార్థులకు మలేరియా నిర్ధారణ అయితే అక్కడే చికిత్స చేసే పరిస్థితి లేదు. మలేరియా ప్రాథమిక దశలో వుంటే అవసరమైన మాత్రలు క్లోరోక్విన్, ఫైమాక్విన్ మాత్రమే పిహెచ్‌సిల్లో వుంటున్నాయి. వీటితో మలేరియా జ్వరాలు తగ్గే అవకాశం లేకపోవడంతో పిహెచ్‌సి వైద్యులు మలేరియా అనగానే ఏరియా ఆసుపత్రికి రిఫర్ చేస్తున్నారు. నియోజకవర్గ పరిధిలో ఉన్న సాలూరు, పాచి పెంట, మక్కువ మండలాలలో ఏడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలున్నాయి. ఈ ఆసుపత్రుల్లో ఇద్దరు చొప్పున వైద్యులు, మిగిలిన ఆరోగ్య సిబ్బంది ఉన్నారు. దాదాపు ఈ పిహెచ్‌సిలన్నీ 24 గంటలు పని చేసే ఆసుపత్రులే. అంటే ఏ సమయంలో రోగులు పిహెచ్‌సిలకు వెళ్లినా వైద్యం అందించాల్సిన అవసరం ఉంది. వైద్యులు, సిబ్బంది పుష్కలంగా వున్నా మలేరియా నియంత్రణకు అవసరమైన మందుల్లేక పోవడంతో రోగులను ఏరియా ఆసుపత్రికి గత కొంతకాలంగా రిఫర్ చేస్తున్న పరిస్థితి ఏర్పడింది. మలేరియా నియంత్రణకు అవసరమైన ఆర్టిసినేట్ ఇంజెక్షన్లు మాత్రం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అందుబాటులో లేవు. దీంతో పిహెచ్‌సి వైద్యులు రోగులను ఏరియా ఆసుపత్రికి రిఫర్ చేస్తున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి.

#### వార్డెన్ల జేబులకు చిల్లులు

ఆశ్రమ పాఠశాలల్లో, వసతిగృహాల్లో ఉన్న విద్యార్థులు అనారోగ్యానికి గురైతే వారికి వైద్యం అందించాల్సిన బాధ్యత సంబంధిత పాఠశాల వార్డెన్‌పైనే వుంది. దీంతో పాఠశాలలకు చెందిన విద్యార్థులను వార్డెన్లు లేదా ఎఎన్ఎంలు పిహెచ్‌సిలకు ముందుగా తీసుకెళ్తారు. అక్కడ ఆర్టిసినేట్ ఇంజెక్షన్లు అందుబాటులో లేకపోవడంతో వైద్యులు ప్రయివేటు మెడికల్ షాపులో కొనుగోలు చేసుకోవాలని సూచిస్తున్నారు. దీంతో కొంతమంది వార్డెన్లు ఒకరు లేదా ఇద్దరు విద్యార్థులకైతే ఇంజెక్షన్ కొనుగోలు చేసి వైద్యం చేయిస్తారు. ఈ విధంగా తోణాం, మామిడిపల్లి పిహెచ్ సిల పరిధిలో ఉన్న ఆశ్రమ పాఠశాలల విద్యార్థులకు వార్డెన్లు మందులు కొనుగోలు చేసి వైద్యం చేయించిన సందర్భాలు అనేకం ఉన్నాయి. అప్పుడప్పుడూ పిహెచ్ సి వైద్యుల జేబులకూ చిల్లులవుతున్నాయి. వైద్యులు ముందు సొంత డబ్బుతో మందులు కొనుగోలు చేసి తర్వాత ఆసుపత్రి అభివృద్ధి నిధి నుంచి తీసుకోవాలని ఉన్నతాధికారులు ఉచిత సలహాలు ఇస్తున్నారు. అయితే గత కొన్ని సంవత్సరాలుగా ఆసుపత్రి అభివృద్ధి నిధుల మంజూరు కాలేదు. దీంతో పిహెచ్ సి వైద్యులు మందుల్లేవని పైకి చెప్పలేక సొంత డబ్బుతో మందులు కొనుగోలు చేయలేక రోగులను ఏరియా ఆసుపత్రికి రిఫర్ చేస్తున్నారు.

#### అధికారుల ముందు చూపు ఏదీ

వర్షాలు పడుతున్నాయంటే ఏజెన్సీలో ఏటా వైరల్, మలేరియా జ్వరాలు సాధారణంగా కనిపించే పరిస్థితి ఉంది. ప్రతి పిహెచ్‌సి పరిధిలో పదుల సంఖ్యలో మలేరియా కేసులు నమోదవుతాయి. ఈ విషయం వైద్య, ఆరోగ్య శాఖ జిల్లా, రాష్ట్ర స్థాయి అధికారులకు బాగా తెలుసు. ప్రతి పిహెచ్‌సికి ఏడాదికి అవసరమైన మందుల బడ్జెట్ ప్రతిపాదనలను జిల్లా అధికారులు తీసుకుంటారు. మలేరియా ప్రభావం ఎక్కువగా వుండే ఏజెన్సీ పిహెచ్‌సిలకు నియంత్రణకు అవసరమైన మందులు సీజన్‌కు ముందే ప్రభుత్వం సరఫరా చేయాల్సి ఉంటుంది. పిహెచ్‌సిలకు చౌకరకం మందులు సరఫరా చేసి ఖరీదైన ఆర్టిసినేట్ ఇంజెక్షన్లు మాత్రం అందించడం లేదని తెలుస్తోంది. ఉన్నతాధికారులు ఉద్దేశపూర్వకంగానే మలేరియా నియంత్రణకు అవసరమైన మందులు సరఫరా చేయకుండా పిహెచ్‌సిల్లో మందుల కొరత లేదని పైకి మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్న పరిస్థితి కనిపిస్తోంది. ఇలాంటి పరిస్థితుల వల్ల ఏజెన్సీ ప్రాంతంలో నిరుపేద గిరిజన రోగులు మలేరియా జ్వరానికి సకాలంలో సరైన మందులు వేసుకోక ప్రాణాపాయ స్థితికి చేరుకునే పరిస్థితి తలెత్తుతోంది.

#### గిరిజన సంక్షేమశాఖ మంత్రి దృష్టి పెడతారా?

ఏజెన్సీ ప్రాంతంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మలేరియా నియంత్రణకు అవసరమైన మందుల్లేని పరిస్థితిపై గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు. కొద్దిరోజుల క్రితం మంత్రి సంధ్యారాణి కూడా ఏరియా ఆసుపత్రిలో మలేరియాకి చికిత్స పొందుతున్న కురుకుట్టి గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల విద్యార్థినులను పరామర్శించారు. వెంటనే ఆశ్రమ పాఠశాలల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.



పార్వతీపురం, కురుపాంలో నిరసన ర్యాలీ చేస్తున్న విద్యార్థులు, విద్యార్థి సంఘాల నాయకులు

# బంద్ విజయవంతం

### మూతపడ్డ విద్యా సంస్థలు

**ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్**

నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఎ) జాతీయ పరీక్షలు నిర్వహణలో విఫలమైన నేపథ్యంలో విద్యార్థి సంఘాల పిలుపులో భాగంగా గురువారం చేపట్టిన దేశవ్యాప్త బంద్‌లో జిల్లాలో విజయవంతమైంది. బంద్‌లో భాగంగా పార్వతీపురంలో ఎస్ఎఫ్ఐ, ఎఐఎస్ఎఫ్, పిడిఎస్‌యు తదితర విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో స్థానిక జూనియర్ కాలేజీ నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు. అన్ని విద్యాసంస్థలకు విద్యార్థి సంఘాల నాయకులు వెళ్లి న్యాయబద్ధంగా జరుగుతున్న బంద్‌కు సహకరించాలని విద్యాసంస్థలను కోరడంతో పార్వతీపురంలో బంద్ సంపూర్ణంగా జరిగింది. పిడిఎస్‌యు జిల్లా కన్వీనర్ కె.సోమేష్ మాట్లాడుతూ నీట్‌లో అవకతవకలు జరిగాయని, నీట్ పత్రాలను లీక్ చేసినట్టు విజయేంద్ర గుప్తా ఒప్పుకున్నాడని, ఈ విషయాన్ని కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెల్లడించినప్పటికీ పరీక్షను ఇంకా ఎందుకు రద్దు చేయలేదని పార్లమెంట్లో ఈ అంశంపై చర్చించడానికి కేంద్ర ప్రభుత్వం సుముఖత ఎందుకు చూపించలేదని ప్రశ్నించారు. నీట్ అనేది ఎంతోమంది డాక్టర్లను తయారు చేసే పరీక్ష అని అలాంటి పరీక్షల్లో నిర్లక్ష్యం వహిస్తే రేపు దేశ ఆరోగ్య వ్యవస్థకే పెనుముప్పుగా పరిణమిస్తుందని కాబట్టి వెంటనే ఈ పరీక్షను రద్దు చేయాలని, ఎన్‌టిఎపై తగిన చర్యలు తీసుకోవాలని, మళ్లీ పరీక్ష నిర్వహించాలని, డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి అఖిల్ మాట్లాడుతూ ఇప్పటి వరకు మన రాష్ట్రంలో విలీనం పేరుతో దాదాపు పదివేల పాఠశాలలను మూసేశారని వీటిని వెంటనే తెరిపించాలని అన్నారు. ఆ పాఠశాలలతో కలిపి మన రాష్ట్రంలో 50 వేల టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని మెగా డీఎస్సీ పేరుతో 16000 పోస్టులు భర్తీ చేసి ఆగిపోవడం కాదని మిగిలిన పోస్టులను కూడా భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి రవికుమార్ మాట్లాడుతూ పాలకులు నిరంకుశ పద్ధతులను అనుసరిస్తున్నంత కాలం తమ విద్యార్థి ఉద్యమాలు ఆగవని పోరాడుతూనే ఉంటామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ, ఎఐఎస్ఎఫ్, పిడిఎస్‌యు నాయకులు పాల్గొన్నారు.



సాలూరు : జూనియర్ కాలేజీ వద్ద ఎస్ఎఫ్ఐ నాయకులను అడ్డుకుంటున్నపోలీసులు

**కురుపాం** : ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు పి.రాజశేఖర్ ఆధ్వర్యంలో విద్యార్థులు స్థానిక పోస్టు మెట్రిక్ కళాశాల నుంచి గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాల వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. తెరిచి ఉన్న విద్యాసంస్థలను మూసివేసి రావాడ కూడలిలో భారీగా మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ నీట్ పరీక్ష లీకేజీ వెనుక భారీ కుంభకోణం ఉందని, 12 గంటల ముందు పరీక్షను వాయిదా వేయడం యుసిజి రద్దు చేయడం వంటివి విద్యార్థులకు తీవ్ర ఆందోళన కలిగించిందన్నారు. కావున నీట్ పరీక్షపై సమగ్ర విచారణ చేపట్టి దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గిరిజన సంఘం మండల కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు, ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు సంఖ్యలో పాల్గొన్నారు.

**సాలూరు**: జాతీయ స్థాయి ఎంట్రన్స్ టెస్ట్ నీట్‌లో జరిగిన అక్రమాలకు నిరసనగా ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన నిర్వహించిన పాఠశాలలు, కళాశాలల బంద్ విజయవంతమైంది. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి డి.పండు ఆధ్వర్యాన విద్యార్థులు పట్టణంలోని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలు, కళాశాలలను మూసివేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీట్ పరీక్ష నిర్వహణలో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఘోరంగా విఫలమైందని విమర్శించారు. దేశంలో లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తును ప్రశ్నార్థకంగా మార్చిందని చెప్పారు. నీట్ పరీక్ష లో అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవడం లో కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని పండు అన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు వరుణ్, నితిన్,సింహాద్రి పాల్గొన్నారు.

**గుమ్మలక్ష్మీపురం** : భారత్ బంద్ సందర్భంగా గుమ్మలక్ష్మీపురం ఎస్ఎఫ్ఐ మండల కమిటీ ఆధ్వర్యంలో స్థానిక గవర్నమెంట్ జూనియర్ కళాశాల, జడ్పీహెచ్ఎస్ పాఠశాలలను మూసి వేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు నవీన్, అనిల్ విద్యార్థులు పాల్గొన్నారు.


## సవరభాష వాలంటీర్లు కొనసాగింపు

**ప్రజాశక్తి పార్వతీపురం రూరల్**

ఈ విద్యా సంవత్సరంలో పార్వతీపురం ఐటిడిఎ పరిధిలో పనిచేస్తున్న 176 మంది సవర భాష వారి ఇంటర్వ్యూ యథావిధిగా తమ విధులు నిర్వహించుకోవడానికి అనుమతిస్తూ గురువారం ఐటిడిఎ డిడి రుక్మాంగదయ్యా మౌఖిక ఆదేశాలు జారీ చేశారు. దీనికి ముందుగా సీతంపేట ఐటిడిఎతో పాటు ఇతర ఐటిడిఎల్లో సవర భాష వాలంటీర్లను ఈ విద్యా సంవత్సరం విధులకు అనుమతిస్తూ మౌఖిక ఆదేశాలు సంబంధిత ఐటిడిఎ విద్యాశాఖ అధికారులు జారీ చేసినప్పటికీ పార్వతీపురంలో ఎటువంటి ఆదేశాలు అధికారులు రాకలేదు. దీంతో గురువారం స్థానిక పరిధిలోని సవరభాష వాలంటీర్లు యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.మురళీమోహన్‌రావుతో పాటు సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు ఆధ్వర్యంలో ఐటిడిఎ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. దీంతో అధికారులు దిగివచ్చి ఈ సంవత్సరం సవర భాష వాలంటీర్లు యథావిధిగా తమ విధులు నిర్వహించుకోవచ్చు అని మౌఖిక ఆదేశాలు ఇచ్చారు. కార్యక్రమంలో పలు గ్రామాలకు చెందిన సవర భాషా వాలంటీర్లు, నాయకులు పాల్గొన్నారు.

## రైతాంగ సమస్యలు పరిష్కరించాలి

### జెసికి ఎపి రైతుసంఘం వినతి



జెసికి వినతిని అందజేస్తున్న గిరిజన సంఘం నాయకులు

**ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్**

జిల్లాలో రైతులు ఎదుర్కొంటున్న వ్యవసాయ సంబంధిత సమస్యలను నూతన ప్రభుత్వం గుర్తించి తక్షణమే పరిష్కరించి వ్యవసాయ పరంగా వారి అభివృద్ధికి తోడ్పడాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎం.కృష్ణమూర్తి, రెడ్డి లక్ష్మునాయుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం జాయింట్ కలెక్టర్ శోభికకు వినతి అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ జిల్లా ఏర్పడిన తర్వాత జిల్లాలో పారిశ్రామికంగా, వ్యవసాయపరంగా గానీ అభివృద్ధి జరగలేదన్నారు. జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులు ఉన్నప్పటికీ అవి పరిపూర్ణంగా పూర్తి కాలేకపోవడంతో రైతులు సాగు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. దీర్ఘకాలంగా పార్వతీపురం, సీతానగరం, గరుగుబిల్లి మండలాల రైతులు ఎదురుచూస్తున్న జంఝావతి ప్రాజెక్టు సమస్యను పరిష్కరించి సత్వరమే పూర్తి చేయాలని అన్నారు. పార్వతీపురం మండలంలో ఆడారు రిజర్వాయర్ను తక్షణమే పూర్తి చేయాలన్నారు. వెంగళరాయి రిజర్వాయర్ అదనపు ఆయకట్టు కాలువల పనులు పూర్తి చేసి రైతులకు సాగునీరందించాలని కోరారు. పెద్దగెడ్డ ఎడమల కాలువ నిర్మించి లిఫ్ట్ ద్వారా సాగునీరు అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. తోటపల్లి ఎడమ కాలువ సిమెంటు లైనింగు పపనులు సత్వరమే పూర్తి చేయాలని, జిల్లాలోని గల పలు గెడ్డలపై మినీ రిజర్వాయర్లు నిర్మిస్తే రైతులకు ఎనలేని లాభం కలుగుతుందని వెంటనే వాటిపై దష్టి సారించాలని కోరారు. వెంగళరాయ, పెద్దగెడ్డ, తోటపల్లి కాలువలకు సిమెంటు లైనింగులు సత్వరమే పూర్తి చేయాలని, నిర్వాసితులకు పునరావాసం పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.

లచ్చయ్యపేట షుగర్ ఫ్యాక్టరీ ప్రభుత్వం స్వాధీనం చేసుకొని పునః ప్రారంభించాలని కోరారు. జిల్లాలోని ఏకైక జూట్ మిల్లును తెరిపించాలని, అలాగే టమాటో, చింతపండు, కూరగాయలు నిల్వ చేసుకునేందుకు కోల్డ్ స్టోరేజీలు నిర్మించాలని కోరారు. మొక్కజొన్న, పత్తి, అపరాలు జీడి తదితర పంటల సేకరణకు ప్రభుత్వం సాలూరు, పార్వతీపురం, పాలకొండ, కురుపాంలలో మార్కెట్లను ఏర్పాటు చేయాలన్నారు. కౌలు రైతులకు గుర్తింపు కార్డులు భూయజమానితో సంబంధం లేకుండా జారీ చేయాలని, పంటలకు ప్రభుత్వం ప్రకటించిన స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ తో బ్యాంకు రుణాలు ఇవ్వాలని కోరారు. దీనికి స్పందించిన జెసి ఈ సమస్యలను తప్పకుండా ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్తానని తెలియజేశారు. కార్యక్రమంలో డిఆర్ఒ జి.కేశవ నాయుడు, రైతు సంఘం ఉపాధ్యక్షులు బంటు దాసు, నాయకులు బి.అప్పారావు, బోను గౌరునాయుడు తదితరులు పాల్గొన్నారు.

## జ్వర లక్షణాలున్న ప్రతిఒక్కరికీ పరీక్షలు

**ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్**

జ్వర లక్షణాలున్న ప్రతి ఒక్కరికీ సత్వరమే నిర్ధారణ పరీక్షలు జరపాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కె.విజయపార్వతి స్పష్టం చేశారు. ల్యాబ్ టెక్నీషియన్లకు గురువారం ఎన్జీఓ సమావేశ భవనంలో నిర్వహించిన సమావేశంలో డిఎంహెచ్ఒ మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రబలే కాలం కావున ఆసుపత్రులకు జ్వర లక్షణాలతో వచ్చే వారికి కాలయాపన లేకుండా వెంటనే నిర్ధారణ పరీక్షలు నిర్వహించాలని సూచించారు. మలేరియా, డెంగీ నిర్ధారణ అయితే సత్వరమే వైద్యాధికారి, వైద్యుల దృష్టికి తీసుకొచ్చి తగు చికిత్స అందజేయాలన్నారు. క్షేత్ర స్థాయిలో పరీక్షా కిట్లు తప్పనిసరిగా ఉండాలన్నారు. వసతి గృహ విద్యార్థుల్లో జ్వరాలు ప్రబలకుండా ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. జిల్లా మలేరియా అధికారి డాక్టర్ టి.జగన్మోహన్ రావు మాట్లాడుతూ మైక్రోస్కోపిక్ పరీక్ష ద్వారా మలేరియా నిర్ధారణ స్పష్టంగా ఉండాలన్నారు. మలేరియా, డెంగీ నిర్ధారణ వివరాల రికార్డులు పక్కగా ఉండాలని ఆదేశించారు. ల్యాబ్ నిర్వహణపై మరింత నైపుణ్యతను చేకూర్చేందుకు సెంట్రల్ మెడికల్ ల్యాబ్ నుండి బి.కల్యాణి జిల్లాకు విచ్చేసి సమావేశంలో ల్యాబ్ టెక్నీషియన్లకు మైక్రోస్కోపిక్ పరీక్షా విధానంపై పునఃశ్చరణ శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. అనంతరం డిఎంహెచ్ఒ, డిఎంఒ ద్వారా ఆరోగ్య కేంద్రాలు, ఆసుపత్రుల ల్యాబ్ టెక్నీషియన్లకు మలేరియా నివారణ మందులు అందజేశారు. కార్యక్రమంలో ఎఎంఒ సూర్యనారాయణ, విబిడి కన్సల్టెంట్ రామచంద్ర, ఎన్జీఓ అధ్యక్షులు కిషోర్, మలేరియా కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వైసిపి కార్యాలయానికి రెండో నోటీసు

**ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్**

స్థానిక మున్సిపల్ పట్టణ ప్రణాళిక విభాగం ద్వారా ప్లాన్ ఆమోదం లేకుండా నిర్మిస్తున్న వైసిపి జిల్లా కార్యాలయానికి వార్డు సచివాలయాల టౌన్ ప్లానింగ్ సెక్రటరీలు గురువారంనాడు రెండవ నోటీసును కార్యాలయం గోడలకు అంటించారు. పట్టణంలోని బెలగాంలో 16వ వార్డులో సాయినగర్ కాలనీకి ఆనుకుని ఉన్న జంఝావతి నీటిపారుదల ప్రాజెక్టు కార్యాలయానికి సంబంధించిన స్థలాన్ని అద్దె ప్రాతిపదికన తీసుకొన్నారు. అయితే మున్సిపల్ ప్లాన్ పెట్టకుండా, మున్సిపల్ టౌన్ ప్లానింగ్ విభాగం అనుమతులు పొందకుండా వైసిపి జిల్లా కార్యాలయాన్ని నిర్మిస్తున్నారు. ఈ నేపథ్యంలో మున్సిపల్ కమిషనర్ కె.శ్రీనివాసరావు ఆదేశాలను అనుసరించి మున్సిపల్ టౌన్ ప్లానింగ్ విభాగం అధికారి పి.కనకారావు సూచనల మేరకు సచివాలయాల టౌన్ ప్లానింగ్ సెక్రటరీలు వైసిపి జిల్లా కార్యాలయం భవనం లోపల మొదటి నోటీసును గత నెల అంటించగా, ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు పరీక్షిత్‌రాజుకు నోటీసు అందజేశారు. అయితే వారి నుంచి మున్సిపల్ కార్యాలయానికి ఇప్పటి వరకూ ఎటువంటి సమాధానం రాలేదు.

దీంతో గురువారం మళ్లీ రెండో నోటీసును సచివాలయాల టౌన్ ప్లానింగ్ సెక్రటరీలు జిల్లా వైసిపి పార్టీ అధ్యక్షులు శత్రుచర్ల పరీక్షిత్ రాజు పేరు మీదుగా జిల్లా కార్యాలయం గోడలకు అతికించారు.

# ఘనంగా అల్లూరి జయంతి వేడుకలు

**ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్**

మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలు జిల్లాలోని పలుచోట్ల ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల్లో ఈ వేడుకలు నిర్వహించారు. ఇందులో భాగంగా స్థానిక ఐటిడిఎ వద్ద యుటిఎఫ్, గిరిజన సంఘం, సిఐటియు, భాషా వాలంటీర్లు ఆధ్వర్యంలో గురువారం అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలు జరిగాయి. యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.మురళీమోహన్, గిరిజన సంఘం మండల అధ్యక్షులు హిమరిక బలరాం, బిడ్డిక వెంకటేశ్ అల్లూరి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అల్లూరి పోరాట స్ఫూర్తితో గిరిజన సమస్యలపై పోరాడాలని నాయకులు కోరారు. కార్యక్రమంలో ఊయక గంగరాజు, కొండ గురు సుబ్బారావు బిడ్డకు సుక్కు బి గౌరమ్మ. తదితరులు పాల్గొన్నారు. ప్రభుత్వం గిరిజన విద్యను కాపాడాలి గిరిజన హక్కుల్ని జిల్లా పరిధిలో సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అలాగే స్థానిక సుందరయ్య భవనంలో అల్లూరి జయంతి సిపిఎ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశిస్తూ సిఐటియు నాయకులు గొర్లి సన్యాసి మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం తీసుకొచ్చిన వారిలో అల్లూరి ఒకరని, ఆయన మనకెంతో ఆదర్శమని అన్నారు. నేడు దేశంలోని పాలిస్తున్న బిజెపి మతపరమైన గొడవలకు దారితీస్తుందని, కుల, మతతత్వం దాడులకు గురిచేస్తుందని విమర్శించారు. కావున ఈ సమస్యలపై అల్లూరి స్ఫూర్తితో పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి టి.అఖిల్, సురేష్, హైబు, మమత, బెనర్జీ పాల్గొన్నారు.



సీతంపేటలో అల్లూరికి నివాళ్లు అర్పిస్తున్న గిరిజనసంఘం నాయకులు

**సీతంపేట** : మండలంలోని గిరిజన సంఘం కార్యాలయంలో ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో స్వాతంత్ర్య సమర యోధుడు అల్లూరి సీతారాం రాజు 127 జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు ఎం.తిరుపతి రావు, జె.శ్రీరాములు, సర్పంచ్ జి.సుందరమ్మ, బి. రామ్మోహన్‌రావు, బి.చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

**పాచిపెంట:** మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి మండల కేంద్రంలో డివైఎఫ్ఐ నాయకులు కోట ఎర్రయ్య ఆధ్వర్యంలో నిర్వహించి సీతారామరాజు చిత్రపటానికి పూలమాలలను వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు కోరాడ ఈశ్వరరావు, యువజన సంఘం నాయకులు ఎం భరత్ కుమార్, రాము, ప్రజా సంఘాల నాయకులు పాపయ్య, కసిని బోను బులకయ్య తదితరులు పాల్గొన్నారు.

**కొమరాడ:** మండల కేంద్రంలో అల్లూరి సీతారామరాజు 127 వ జయంతి సందర్భంగా జూనియర్ కాలేజ్ సెంటర్లో ఉన్న అల్లూరి సీతారామరాజు విగ్రహానికి సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి పూలమాలతో ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు లక్ష్మయు, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు ఉపేంద్ర, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు రెడ్డి శివుని నాయుడు, పార్వతీపురం మన్యం జిల్లా కళింగ వైశ్య సంఘం అధ్యక్షులు వడ్డీ గాంధీ తదితరులు పాల్గొన్నారు.

**బలిజిపేట** : మండలంలోని పెదపెంకిలో అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలు నేతాజీ గ్రంథలయం వద్ద గ్రంథాలయం స్థాపకులు, యూత్ ప్రెసిడెంట్ ఈర్ల సంజీవ్ నాయుడు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన బలిజిపేట సత్య సాయి కన్వీనర్ వెలది సుబ్బారావు సీతారామరాజు చిత్రపటానికి పూల మాల వేసి జ్యోతి ప్రజ్వలన చేశారు. కార్యక్రమంలో బొద్దన జగంకోట తాత బాబు, పంచాయతీ బోర్డుసభ్యులు కోట భాస్కర్, నేతాజీ గ్రంథాలయం యువత కోట గౌరీనాథ్, చైతన్య, గొర్రెల శ్రావణ్ కుమార్, పెంకి పరశురామ్ తదితరులు పాల్గొన్నారు.



పార్వతీపురం : ఐటిడిఎ వద్ద అల్లూరికి నివాళ్లు అర్పిస్తున్న ప్రజాసంఘాల నాయకులు



బలిజిపేటలో గ్రంథాలయం వద్ద నివాళ్లు అర్పిస్తున్న సుబ్బారావు


ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది, గ్రామస్తులు

## డయేరియా నుంచి పిల్లలను రక్షిద్దాం

**ప్రజాశక్తి - బలిజిపేట**

మండలంలోని నూకల వాడ గ్రామంలో గురువారం డయేరియా వ్యాధి నుంచి పిల్లలను రక్షిద్దాం అనే కార్యక్రమాన్ని స్థానిక పిహెచ్‌సి వైద్యాధికారి ఎం.మాధురి సమక్షంలో నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ పురవీధులలో డయేరియా, డెంగీ వ్యాధులపై అవగాహన కల్పించారు. అనంతరం వైద్యాధికారి మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల పట్ల చిన్న పిల్లలు, పెద్దలు, వృద్ధులు జాగ్రత్త వహించాలని, డ్రై డే పాటించాలని ఆమె తెలిపారు. ప్రతి ఇంటికి సర్వే చేసి డయేరియా వ్యాధిగ్రస్తులకు ఒక జింక్ మాత్ర, రెండు ఓఆర్ఎస్‌లు, 14 రోజుల పాటు స్థానిక వైద్య సిబ్బంది సహాతో తీసుకోవాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపిహెచ్ ఇఒ కె.శ్యామల, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## 6న పెంపుడు కుక్కలకు టీకాలు

**ప్రజాశక్తి - కురుపాం**

ప్రపంచ జోనోసిస్ దినోత్సవ సందర్భంగా మండలంలోని గుమ్మ పశు వైద్య కేంద్రం వద్ద ఈనెల 6న పెంపుడు కుక్కలకు ఉచిత యాంటీ రాబిస్ టీకాలు వేస్తున్నామని పశు వైద్య అధికారి కె.శైలజ తెలిపారు. ఈ సందర్భంగా గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ జోనోసిస్ వ్యాధులు అనేవి జంతువుల నుంచి మనుషులకు, మనుషుల నుండి జంతువులకు సంక్రమించే వ్యాధులని, కావున పెంపుడు కుక్కలు యజమానులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని వారు పెంచిన కుక్కలను ఆసుపత్రికి తీసుకువచ్చి టీకాను వేయించుకోవాలని కోరారు.



మీ సేవా కేంద్రం వద్ద పడిగాపులు కాస్తున్న జనం

## కెవైసి కోసం తప్పని పాట్లు

**ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం**

ప్రభుత్వం అందించే ఉచిత గ్యాస్ సిలిండర్లు కోసం కెవైసి చేయించుకునేందుకు గుమ్మలక్ష్మీపురం జిసిసి కార్యాలయానికి వస్తున్న ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. ఎప్పటికప్పుడు ఇంటర్నెట్ సర్వర్ నిలిచిపోవడంతో గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తోంది. గురువారం జిసిసి కార్యాలయానికి చుట్టుపక్క గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు ఇలా మండుటెండలో నిరీక్షించాల్సి వచ్చింది. దీనిపై అధికారులు స్పందించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

## ప్రమాణాలు పాటించకపోతే రికవరీ

**ప్రజాశక్తి - వీరఘట్టం**

బిటి రహదారి నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించకపోతే రికవరీ చేస్తామని సీతంపేట ఐటిడిఎ జెఇ కె.నాగభూషణ్ గుత్తేదారునికి హెచ్చరించారు. గురువారం మండలంలోని చిట్టిపూడివలస గ్రామ బిటి రహదారి నిర్మాణ పనులు పరిశీలించిన సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. సిఎస్పి రహదారి నుంచి గ్రామ వరకు సుమారు 1700 మీటర్ల దూరంలో రూ.కోటీ20 లక్షలతో బిటి రహదారితో పాటు 8 కల్వర్టులు కూడా నిర్మించినట్టు తెలిపారు. ఎక్కడా రాజీ లేకుండా పనులు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు.

## పాఠశాల విద్యార్థులకు వైద్య పరీక్షలు

**ప్రజాశక్తి - కురుపాం**

స్థానిక గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాల విద్యార్థులకు గురువారం రావాడ రామభద్రపురం పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ సిహెచ్ శంకరరావు వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. అనంతరం విద్యార్థుల వ్యక్తిగత పరిశుభ్రత, తరగతి గదిలో పరిసర ప్రాంతాల్లో పారిశుధ్యం, చేతులు శుభ్రపరచడంపై వ్యాధుల బారిన పడకుండా ముందస్తు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి.రామ గోవింద, వార్డెన్ కె.సూర్యనారాయణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## డెంగీపై అవగాహన ర్యాలీ

**ప్రజాశక్తి - సీతానగరం**

మండలంలోని లక్ష్మీపురం గ్రామ సచివాలయంలో పెదంకలం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఆధ్వర్యంలో మలేరియా వ్యాధులపై గురువారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇంటి పరిశుభ్రతను పాటించాలని సీజన్‌లో వచ్చే వ్యాధులపైన అప్రమత్తంగా ఉండాలని అన్నారు. అనంతరం వైద్య శిబిరం ఏర్పాటు చేసి రోగులకు ఉచిత మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎస్ గోపాల్ రావు, హెల్త్ అసిస్టెంట్లు ప్రసాద్, వెంకటేశు, పంచాయతీ కార్యదర్శి వెంకటనాయుడు, ఎఎన్ఎం బి.రమాదేవి, ఆశ, అంగన్వాడి తదితరులు పాల్గొన్నారు.


స్థల పరిశీలన చేస్తున్న టిడిపి నాయకులు

## నేడు ఎమ్మెల్యే జగదీశ్వరి విజయోత్సవ ర్యాలీ

**ప్రజాశక్తి - కురుపాం**

నియోజకవర్గ కేంద్రమైన కురుపాంలో శుక్రవారం ఎమ్మెల్యే టి.జగదీశ్వరి విజయోత్సవ ర్యాలీ సభ టిడిపి రాష్ట్ర కార్యదర్శి వైరచర్ల వీరేశ్‌చంద్రదేవ్ ఆధ్వర్యంలో జరగనుంది. సాయి బాబా గుడి ఎదురు మైదానం వద్ద విజయోత్సవ సభ ఏర్పాట్లును దగ్గరుండి పర్యవేక్షించిన వీరేష్ చంద్రదేవ్ మాట్లాడుతూ ఐదు మండలాల్లో టిడిపి నాయకులు, కార్యకర్తలు విజయోత్సవ ర్యాలీ సభలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ పరిశీలనలో టిడిపి నాయకులు డొంకాడ రామకృష్ణ, కోలా రంజిత్ కుమార్, చందక రామకృష్ణ, మర్రాపు పురుషోత్తమ నాయుడు, శేఖర్ పాత్రుడు, జివి రమణమూర్తి, పల్లా రాంబాబు పాల్గొన్నారు

## బావిలోకి దూకిన మహిళ

### బయటకు తీసిన పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది

**ప్రజాశక్తి - వీరఘట్టం**

మండలంలోని చలి వేంద్రీ గ్రామానికి చెందిన గొట్టపు లావణ్య అదే గ్రామంలో బావిలో దూకింది. విషయం తెలుసుకున్న స్థానిక ఎస్సై జి కళాధర్ సంఘటన స్థలానికి చేరుకొని తక్షణమే పాలకొండలోనే అగ్నిమాపక శాఖ అధికారి జామి సర్వేశ్వరావుకి ఫోన్ ద్వారా సమాచారం అందించారు. ఆయన స్పందించి సిబ్బందితో చలివేంద్ర గ్రామానికి చేరుకున్నారు. అప్పటికే లావణ్య బావిలో ఒక రాయిని పట్టుకుని వేలాడుతుంది. వెంటనే నిచ్చెనతో బావిలోకి దిగి ఆమెను సురక్షితంగా బయటికి తీసుకువచ్చారు. లావణ్యను తన భర్త గణపతికి అప్పజెప్పారు. కుటుంబ ఆర్థిక పరిస్థితులు, ఆరోగ్యం సరిగా లేకపోవడం వల్ల లావణ్య బావిలోకి దూకినట్లు తెలిపారు. సురక్షితంగా లావణ్యను బయటకు తీయడంతో కుటుంబ సభ్యులు, గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు.

# అల్లూరి వ్యక్తి కాదు.. సమూహ శక్తి

**ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్**

అల్లూరి సీతారామరాజు అంటే వ్యక్తి కాదు సమూహ శక్తి అని జాయింట్ కలెక్టర్ ఎస్.ఎస్ శోభిక అన్నారు. గురువారం అల్లూరి సీతారామరాజు 127వ జయంతి వేడుకలు జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరం లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జెసి అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు అంటే విప్లవ యోధుడని, సంగ్రామ భేరి, స్వాతంత్య్ర నినాదం, సమరగీతం, ఉద్యమ జ్వాల అని ఆమె పేర్కొన్నారు. సీతారామరాజు ధైర్యసాహసాలు, ప్రాణత్యాగం ఎందరో భారతీయులను ఉత్తేజపరిచి, వారిలో జాతీయతా భావాన్ని, దేశభక్తిని పురిగొల్పాయని అన్నారు. కార్యక్రమంలో డిఆర్ఒ జి.కేశవనాయుడు, కలెక్టరేట్ ఎఒ వేణుగోపాలరావు, డిపిఒ బి.సత్యనారాయణ, రెవెన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.


**మండల పరిషత్ కార్యాలయంలో...**

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ ఆకిబ్ జావెద్ ఆధ్వర్యాన అల్లూరి జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎఒ రమణమూర్తి పాల్గొన్నారు.

**మున్సిపల్ కార్యాలయంలో....**

**పార్వతీపురం టౌన్ :** అల్లూరి సీతారామ రాజు 127వ జయంతి వేడుకలను స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి కమిషనర్ కె శ్రీనివాస్, మున్సిపల్ కార్యాలయ అధికారులు, సిబ్బందితో కలిసి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో రెవెన్యూ టౌన్ ప్లానింగ్, ఇంజనీరింగ్, ప్రజారోగ్య విభాగం అధికారులు పాల్గొన్నారు..

**సాలూరు:** స్వాతంత్య్ర సమర యోధుడు అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఇంఛార్జి కమిషనర్ శ్రీరామ్మూర్తి, మేనేజర్ రాఘవాచార్యులు అల్లూరి కి నివాళులర్పించిన వారిలో వున్నారు.



పార్వతీపురం రూరల్: అల్లూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జెసి

**పాలకొండ :** అల్లూరి సీతారామరాజు త్యాగం మరువలేనిదని ఆర్‌డిఒ వివి రమణ అన్నారు. అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా స్థానిక ఆర్‌డిఒ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్య్ర ఉద్యమంలో ఆయన చేసిన పోరాటం వెలకట్టలేనిదన్నారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

**పార్వతీపురంరూరల్ :** విద్యార్థులు అల్లూరి సీతారామరాజు ను ఆదర్శంగా తీసుకుని లక్ష్యం దిశగా ముందుకు సాగాలని జిల్లా గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు ఎం.రుక్మాంగదయ్య అన్నారు. ఈమేరకు పార్వతీపురం బెలగాంలోని గిరిజన బాలిక కళాశాల వసతి గృహంలో జెవివి జిల్లా కార్యదర్శి ధనాల చంద్ర మౌళి అధ్యక్షతన అల్లూరి సీతారామరాజు127 జయంతి సభ నిర్వహించారు. జిల్లా పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ అధికారి డాక్టర్ ఎంవీఆర్ కృష్ణాజీ, జెవివి రాష్ట్ర కార్యదర్శి పి.రంజిత్ కుమార్ మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు లాంటి వారి త్యాగాల వల్ల కలిగిన ప్రయోజనాలు, సౌకర్యాలు ఉపయోగించి భవిష్యత్ బాగు కోసం నిరంతరం ఆలోచన చేయాలని సూచించారు. కార్యక్రమంలో వసతి గహం సంక్షేమ అధికారి రాజేశ్వరి విద్యార్థులు పాల్గొన్నారు.

**గుమ్మలక్ష్మీపురం :** మండలంలోని కేదారిపురం గ్రామ సచివాలయంలో అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. అలాగే స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అల్లూరి చిత్రపటానికి వైస్ ప్రిన్సిపల్ రామయ్య, ఎన్ఎస్ఎస్ పిఒ త్రినాధ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అల్లూరి ఆంగ్లేయలతో చేసిన పోరాటాలు విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు.

**కొమరాడ :** మన్యంపులి అల్లూరి సీతారామరాజు ఆశయ సాధనకు కృషి చేయాలని ఎంపిడిఒ ఎం.మల్లికార్జున రావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో 127వ జయంతి సందర్భంగా అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఎఒ ఎస్.రమేష్, ఇఒపిఆర్‌డి రాధాకృష్ణ, ఎపిఎం వెంకటరమణ, మండల పరిషత్, వెలుగు కార్యాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

**వీరఘట్టం:** స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహశీల్దార్ కె.జయప్రకాశ్ అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాలలు వేశారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎఒ వై.వెంకటరమణ అల్లూరి సీతారామ చిత్రపటానికి పూలమాలలు వేశారు. నడుకూరులో ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా జనసేన జిల్లా కార్యదర్శి బిసి నాయుడు, సంయుక్త కార్యదర్శి జనసేన జానీ, పాలకొండ నియోజకవర్గం నాయకులు ఎం.పుండరీకం ఆధ్వర్యంలో అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేశారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ సిహెచ్.సత్యనారాయణ, విఆర్‌ఒలు, తహశీల్దార్, మండల పరిషత్ కార్యాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

**సీతానగరం:** స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎఓ ఎంవిఎస్ ప్రసాద్, ఎంపిపి ప్రతినిధి బలగా శ్రీరాములు నాయుడు, జెడ్‌పిటిసి ఎం బాబ్జి, తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ శ్రీనివాసరావు, డిటి పురుషోత్తం, చిట్టమ్మ, ఆర్‌ఐ శ్రీనివాసరావు, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపల్ దాలినాయుడు, అధ్యాపకులు సీతారామరాజు చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

# ఉపాధి పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలి

**ప్రజాశక్తి - పాలకొండ**

ఉపాధి హామీ పనులు చేసిన కూలీలకు 8 వారాల పెండింగ్‌లో ఉన్న బిల్లులు వెంటనే చెల్లించాలని, రెండో పూట పని రద్దు చేయాలి, ఏడాదికి 200 రోజులు పని, రోజుకూలి రూ.400 ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో స్థానిక ఎంపిడిఒ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యవర్గ సభ్యులు దూసి దుర్గారావు మాట్లాడుతూ ఉపాధి కూలీలు ఈ ఏడాది ఏప్రిల్ నుంచి తీవ్రమైన ఎండలో రెండుపూటలా చేసిన పనికి సుమారు 5 వారాల నుంచి 8 వారాల వరకు వేతనాలు పెండింగ్‌లో వున్నాయన్నారు. గత 7 నెలలుగా ఉపాధి కూలీలకు వ్యవసాయ పనుల్లేక ఇటు చేసిన ఉపాధి పనులకు బిల్లుల రాక తీవ్రమైన ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. రెండు పూటల పని చేయడం వల్ల కూలీల పనివద్దకు సుమారు సరాసరి రోజుకు 7 కిలోమీటర్ల దూరం నడుస్తున్నారని, దీనివల్ల కూలీల ఆరోగ్యం దెబ్బతిం టుంనానరు. వ్యవసాయ పనులు, ఇంటి పనులు చేసుకోవ డానికి ఆటంకంగా ఉందన్నారు. యంత్రాలు పెరగడంతో వ్యవసాయ పనులు బాగా తగ్గిపోయి కూలీలు వలసలు వెళ్లి పోయే ప్రమాదం వుందని, కావున ఏడాదికి 200 రోజులు పని దినాలు కల్పించాలని డిమాండ్ చేశారు. మేట్ లకు ఇచ్చిన ప్రోత్సాహం ఇవ్వాలి, పార, పలుగు, తట్ట ల నిర్వాహణకు డబ్బులు వేయాలి, మంచి నీరు, మజ్జిగ సరఫరా చేయాలని కోరారు. అనంతరం ఎంపిడిఒకు వినతిని అందజేశారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి కాదా రాము, వ్యవసాయ కార్మిక సంఘం ప్రతినిధులు పిట్ట త్రినాధ, ఎన్ని యశోదమ్మ, బి.అంకమ్మ, పట్నాన సరోజిని, కుర్మాన రాములమ్మ, గొట్టాపు లక్ష్మణరావు లక్ష్మ పాల్గొన్నారు.


పాలకొండ: నిరసన తెలుపుతున్న కూలీలు

**గరుగుబిల్లి :** ఉపాధి హామీ పథకం పనులు ఒక పూటకు మార్చాలని, ఉపాధి హామీ పనులు 200 రోజులకు పెంచాలని, రోజు వేతనం రూ.400 నిర్ణయించాలని డిమాండ్ చేస్తూ స్థానిక ఎంపిడిఒ కార్యాలయం ఎదుట వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు బివి రమణ, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఎ.రామకృష్ణ తదితరులు మాట్లాడుతూ మండలంలో బకాయి ఉన్న నాలుగు వారాల వేతనాలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఇఒపిఆర్‌డి గోపాలరావుకు వినతిని అందజేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు నల్ల శంకర్రావు, జాగాన అప్పలనాయుడు, జాగాన శంకరరావు, తదితరులు పాల్గొన్నారు.

**వీరఘట్టం:** ఉపాధి కూలీలకు పెండింగ్లో ఉన్న బకాయిలను తక్షణమే చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల కమిటీ నాయకులు ఎన్.సింహాచలం డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక మండల పరిషత్ కార్యాలయ జూనియర్ సహాయకులు ఎస్ సూర్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. తక్షణమే సమస్యలు పరిష్కరించాలన్నారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో సిఐటియు మండల నాయకులు ఎన్.ప్రసాదరావు, కృష్ణ ఉన్నారు.

## 10న కార్మిక డిమాండ్స్‌డేను జయప్రదం చేయండి

**ప్రజాశక్తి - మక్కువ**

డిమాండ్స్ డే ను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ముందు ఉంచాలని సిఐటియు నిర్ణయించిందని, ఈ మేరకు ఆరోజున ఈకార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్‌వై నాయుడు కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. గురువారం మక్కువ లో జరిగిన విలేకరుల సమావేశంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు జి కృష్ణతో కలిసి విలేకరుల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వర్గానికి కనీస వేతనం 26,000 ఇవ్వాలని, దీనికి గాను గతంలో వేసిన కమిటీ సిఫార్సులు అమలు చేయాలని, పిఎఫ్, ఇఎస్ఐ చట్టాలను అమలు జరిపి, రిటైర్ అవుతున్న కార్మిక వర్గానికి సగం జీతం పెన్షన్ గా ఇవ్వాలని, రాష్ట్రంలో రికవరీ చేసిన విఆర్‌ఎల డిఎను తిరిగి జీతాలతో కలిపి చెల్లించాలని, స్కీం వర్కర్లను కార్మికులుగా గుర్తించాలని, ప్రైవేటీకరణ విధానాలు నిలిపివేయాలని డిమాండ్ చేశారు. విలేకరుల సమావేశంలో సిఐటియు మండల నాయకులు పవన్, ఎం.కృష్ణ, లక్ష్మణరావు పాల్గొన్నారు.

## అక్రమంగా పశువుల తరలింపు

**ప్రజాశక్తి -భామిని**

ఆంధ్రా-ఒడిస్సా సరిహద్దు ప్రాంతం పార్వతీపురం మన్యం జిల్లా, భామిని నుంచి ఇతర ప్రాంతాలకు పశువులు తరలింపు రాత్రి వేళల్లో యథేచ్ఛగా కొనసాగుతుంది. పశువులు అక్రమ తరలింపు, రాత్రి వేళల్లో ఒడిశా నుండి భామిని మండలం సరిహద్దు ప్రాంతాలకు పశువులు నడక మార్గంలో తరలించి, అనంతరం ప్రత్యేక వాహనంలో జాతీయ రహదారికి తరలిస్తున్నారు. ఇది వరకు పోలీస్ చెక్ పోస్టులుండంతో పశువులు నడిపించి తరలించే వారు. ప్రస్తుతం చెక్ పోస్టులు లేకపోవడంతో యథేచ్ఛగా వాహనాల్లో తరలిస్తున్నారు. పశువుల అక్రమ రవాణాకు కేంద్రంగా మారిన భామిని మండలంలో భామిని, బత్తిలి, బాలేరులో పశువులు తాత్కాలికంగా ఉంచి, రాత్రి సమయంలో తరలింపు చేస్తున్నారు.


వ్యాన్ ద్వారా తరలిపోతున్న పశువులు

## విద్యార్థులకు అవగాహన

**ప్రజాశక్తి - భామిని**

ఆస్పిరేషనల్ బ్లాక్ ప్రోగ్రాం ద్వారా కేంద్రం ప్రభుత్వం మండలంలోని విద్య, వైద్య, పోషణ, వ్యవసాయం, సమాజం వంటి 5 రంగాల అభివృద్ధి సంపూర్ణత అభియాన్ అనే కార్యక్రమం చేపట్టిందని మండలం ఆస్పిరేషనల్ బ్లాక్ కో ఆర్డినేటర్ మహేశ్వరరావు తెలిపారు. ప్రజల్లో సంపూర్ణత అభియాన్ కార్యక్రమంపై అవగాహన కల్పించడానికి గురువారం విద్యార్థులతో అర కిలోమీటరు నడిచి సంపూర్ణ యాత్ర కార్యక్రమం చేపట్టామని, అనంతరం స్థానిక అంబేద్కర్ కూడలిలో మానవహారం చేపట్టమని, బాలికల విద్య పట్ల కూడా అవగాహన చేపట్టినట్టు బ్లాక్ కో ఆర్డినేటర్ తెలిపారు. కార్యక్రమంలో ఎంపిడిఒ రావాడ కిశోర్ కుమార్, ఎంఇఒ భాస్కరరావు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

# మొక్కలు పెంపకం ఎంతో మేలు

**ప్రజాశక్తి - పాలకొండ**

మొక్కల పెంపకం సమాజానికి ఎంతో మేలు చేకూరుతుందని స్థానిక ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ అన్నారు. అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా తహశీల్దారు కార్యాలయ ఆవరణంలో గురువారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెట్లు లేకపోవడం వల్ల కాలుష్యం పెరిగిపోతుందన్నారు. మొక్కలు నాటి కాలుష్యం నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని అన్నారు. నాటిన ప్రతి మొక్క ఎదుగుదలకు కార్యాలయ సిబ్బంది బాధ్యత తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ జివి కృష్ణారావు, సిఐ ఎం.చంద్రమౌళి, ఎఫ్ఆర్ఒ తవిటినాయుడు, తహశీల్దారు వరహాలు, కమిషనర్ సర్వేశ్వరరావు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి కర్నేని అప్పలనాయుడు, మండల పార్టీ అధ్యక్షులు గండి రామినాయుడు, పట్టణ పార్టీ అధ్యక్షులు గంటా సంతోష్ కుమార్, జనసేన జిల్లా ఉపాధ్యక్షులు గర్భాన సత్తిబాబు, తదితరులు ఉన్నారు.


మొక్క నాటుతున్న ఎమ్మెల్యే జయకృష్ణ

# ఏజెన్సీ రోడ్లకు ప్రాధాన్యత : ఎమ్మెల్యే

**ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం**

నియోజకవర్గంలోని ఏజెన్సీ ప్రాంతంలో ఉన్న మారుమూల గిరిజన గ్రామాలకు రోడ్లు వేసేందుకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. మండలంలోని గిరిశిఖర గ్రామమైన ఎగువ తాడికొండ నుంచి అడ్డంగి జంగడ భద్ర గ్రామం వరకు రూ.2.6 కోట్లతో 3.5 కిలోమీటర్ల పొడవునా బిటి రోడ్డు నిర్మాణానికి గురువారం ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొండల పైన గ్రామాలకు రోడ్లు నిర్మించి విద్య, వైద్యం, తాగునీరు వంటి మౌలిక వసతులు మెరుగుకు కృషి చేస్తామని, గిరిజనుల డోలీల కష్టాలు లేకుండా చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ పాడి సుదర్శన్‌రావు, కార్యదర్శి పోలూరి శ్రీనివాస రావు, సీనియర్ నాయకులు బిడ్డిక పద్మావతి, కడ్రక కళావతి, వెంపటాపు భారతి, రొబ్బ లోవ రాజు, జనసేన నియోజకవర్గం సమన్వయకర్త కడ్రక మల్లేశ్వర రావు, డిఇ సింహాచలం, ఎఇ అప్పారావు, పలువురు సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**మహేష్ కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే**

**కురుపాం:** మండల కేంద్రమైన కురుపాం లోని దోనక వీధికి చెందిన టిడిపి కార్యకర్త అర్తాపు మహేష్ అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం రాత్రి మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి గురువారం ఆయన ఇంటికి వెళ్లి మృతదేహానికి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. కుటుంబ సభ్యులకు అన్ని విధాలా అండగా ఉంటామని ధైర్యాన్ని ఇచ్చి ఏ అవసరం వచ్చిన వెంటనే తనకు సంప్రదించాలని అన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కోలా రంజిత్ కుమార్, చందక రామకృష్ణ తదితరులు ఉన్నారు.


గుమ్మలక్ష్మీపురం: శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

# పాల'కొండ'ంత సాయం

**ప్రజాశక్తి - పాలకొండ**

పట్టణంలో ఎవరికి ఏ కష్టం వచ్చినా తానున్నాను అంటూ ముందుకు వచ్చి పెద్ద మనసుతో సహాయం అందించడానికి వెనుకాడని వ్యక్తి ఆయన. రాజకీయలు సాధారణమే. వ్యక్తిగా గౌరవం పొందాలనే ఉద్దేశంతో ఆయన అడుగులు వేస్తారు. పది మందికి సహాయం చేస్తే పోయేదేముంది అనే మనస్తత్వం ఆయనది. ఆయన మరెవరో కాదు మాజీ చైర్‌పర్సన్ ప్రతినిధి పల్లా కొండలరావు. ఆయన సంపాదనలో ఎంతో కొంత సమాజ శ్రేయస్సుకు ఇవ్వాలనేదే ఆయన ఆలోచన. కష్టంతో వచ్చిన వారికి తానున్నాను అంటూ భరోసా ఇవ్వడం ఆయనకు అలవాటు. అదే విధంగా సామాజిక అవసరాలను గుర్తించి వీలైనంత వరకు సహాయం చేయడం ఆయనకు ఇష్టం. పట్టణంలో మృతి చెందిన వారికి శ్మశానం వద్దకు తీసుకు వెళ్ళేందుకు రూ.8లక్షలతో మహా ప్రస్థాన వాహనాన్ని అందుబాటులోకి తీసుకుని వచ్చారు. సబ్-రిజిష్టర్ కార్యాలయంలో వివిధ పనుల మీద వచ్చినవారికి సరైన వసతులు లేకపోవడంతో కూర్చోవడానికి సిమెంట్ పలకలు నిర్మించారు. ఏరియా ఆసుపత్రిలో రోగుల ఇబ్బందులను గుర్తించి కుర్చీలు విరాళంగా అందించారు. అదే విధంగా అగ్నిమాపక కార్యాలయం పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో తాత్కాలిక నిర్మాణానికి సిబ్బంది చర్యలు తీసుకోవడంతో ఆయన ముందుకు వచ్చి నిర్మాణానికి సహాయం అందించారు. పట్టణంలో ఆలయాల అభివృద్ధికి ముందుండి సహాయాన్ని అందించడంలో వెనుకాడరు.


పల్లా కొండలరావు

# పూర్తిస్థాయిలో తాగు నీరందించాలి

**ప్రజాశక్తి - కొమరాడ**

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతి ఇంటికీ తాగునీరు అందించేందుకు ఎంతో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన జలజీవన్ మిషన్ 11 ద్వారా పూర్తిస్థాయిలో తాగునీరు అందవ్వాలని సిపిఎం పార్టీ నాయకులు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో రజిక వీధి కొళాయి వద్ద కాలి బిందులతో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో జెజెఎం పథకం ద్వారా నీరు పూర్తి స్థాయిలో అందని పరిస్థితి ఉందని అన్నారు. అనేక గ్రామాల్లో 50 శాతం మాత్రమే నీరు అందుతుందని వెంటనే జెజెఎం పథకం ద్వారా పూర్తిస్థాయిలో గిరిజన గ్రామాలకు నీరందించాలన్నారు. మండల కేంద్రంలో 40 కుటుంబాలు రజక వీధిలో జీవిస్తున్నాయని వీరికి జేజేయం పథకం ద్వారా నీటి కొళాయిలు ఏర్పాటుచేసినా వాటి ద్వారా సక్రమంగా తాగునీరు రావడం లేదన్నారు. దీనిపై ఇప్పటికై ఎనిమిది సార్లు నిరసనలు తెలిపినా అధికారులు పట్టించుకోవడం లేదని ఆగ్రహించారు. ఇప్పటికైనా తక్షణమే స్పందించి కొళాయిల ద్వారా తాగునీరు పూర్తిస్థాయిలో గిరిజనలకు అందివ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు మహిళలు పాల్గొన్నారు.


బిందెలతో నిరసన తెలుపుతున్న సాంబమూర్తి, మహిళలు


వాటర్ ప్లాంట్‌ను పరిశీలిస్తున్న డిడి అన్నదొర

## లబ్బ పాఠశాల సందర్శన

**ప్రజాశక్తి - సీతంపేట**

స్థానిక ఐటిడిఎ పరిధిలో ఉన్న లబ్బ ఆశ్రమ ఉన్నత పాఠశాలను డిప్యూటీ డైరెక్టర్ ఎం.అన్నదొర, డిప్యూటీ ఇఒ పి.నారాయుడు గురువారం సందర్శించారు. పాఠశాలలో వాటర్ ప్లాంట్ కండిషన్‌లో ఉందా లేదా, పనిచేస్తుందా లేదా అనేది తెలుసుకున్నారు. డ్రాపౌట్స్ పిల్లల్ని తిరిగి పాఠశాలలో చేర్పించాలన్నారు. టెక్స్ట్ బుక్స్ అందరు పిల్లలకి అందాయా, లేదా అనేది పరిశీలించారు. పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉన్నాయా లేదా అనేది పరిశీలించారు. డ్రైనేజీ క్లీన్‌గా ఉందా లేదా అనేది, స్టోర్ రూమ్ పరిసరాలు పరిశుభ్రంగా ఉన్నాయా లేదా అనేది విద్యార్థుల ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్టూడెంట్ కిట్స్ విద్యార్థులకు అందజేయనిది పరిశీలించారు. కార్యక్రమంలో ఎంఇఒ, సిఎంఒ, జిసిడిఒ పాల్గొన్నారు.

## పిల్లలకు ఫిజియోథెరపీ

**ప్రజాశక్తి - వీరఘట్టం**

మండల కేంద్రంలోని రెగ్యులర్ పాఠశాల ఆవరణలోనే భవిత కేంద్రంలో గురువారం సహిత విద్యావిభాగ ఆధ్వర్యంలో డాక్టర్ ఆర్ శ్రీకాంత్ ప్రత్యేకవసరాల పిల్లలకు ఫిజియోథెరపీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక్కడ చేసినట్టే ఇంటి దగ్గర కూడా క్రమం తప్పకుండా పిల్లలకు ఫిజియోథెరపీ చేస్తే ఆరోగ్యంగా ఉంటారని తల్లిదండ్రులకు సూచించారు. అనంతరం గ్రామంలోనే రెల్లి వీధికి చెందిన దేవుపల్లి విమల్ గృహానికి వెళ్లి ఫిజియోథెరపీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి-2 ఆర్ ఆనందరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు డి.నారాయణరావు, సహిత ఉపాధ్యాయులు రాంబాబు, యు ఈశ్వరి, సిజివి సునీత పాల్గొన్నారు.


బాలికకు ఫిజియోథెరపీ చేస్తున్న వైద్యుడు ఆర్ శ్రీకాంత్